
ప్రజాశక్తి

శుక్రవారం 13 జనవరి 2023 5

పార్వతీపురం మన్యం



చదురు గుడి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

మక్కువ : శంబర పోలమాంబ అమ్మవారి చదురగుడిలో ఉన్న హుండీ తెరచి గురువారం దేవాదాయశాఖ అధికారులు లెక్కింపు చేపట్టారు. దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారి ఎం.ప్రసాద రావు సమక్షంలో లెక్కించారు. గత జాతర అనంతరం నుంచి ఇప్పటి వరకు భక్తుల నుంచి వచ్చిన హుండీ ఆదాయం రూ.లక్షా95వేలు లభించింది. కార్యక్రమంలో ఇఒ రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పల్లెగూటికి పండగొచ్చింది

- మన్యంలో సంక్రాంతి శోభ
- కిటకిటలాడుతున్న సంత



కొనుగోలుదారులతో కిక్కిరిసిన కురుపాం సంత

ప్రజాశక్తి - కురుపాం

మన్యం పచ్చని పొలాలు.. కల్లాల్లో పండిన పంటలు... తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల అప్యాయతా అనురాగాలు.. ఉన్నంతలో కలసిమెలసి సాగే జీవనం.. ఒక్కమాటలో చెప్పాలంటే పల్లెలోగిలికి కుటుంబమే ఆభరణం.. ఇదీ మన పల్లె ఖ్యాతి.. కానీ పల్లెల్లో ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీధుల్లో తాళం వేసిన ఇళ్లు... చెట్ల కింద పిల్లల రాక కోసం వృద్ధుల నిరీక్షణ.. ఏవైనా పండగలు వస్తే తప్ప పల్లెల్లో కళ లేకుండా పోయింది. సొంతూరిని, కన్నవారిని కలుసుకొనేలా సంక్రాంతి పండగ వచ్చింది. పిల్లలంతా బతుకు తెరువుకు పట్టణాలకు పోతే ఇంటివద్ద నిరీక్షిస్తున్న ముసలి ప్రాణాలకు మళ్లీ వీరి రాకతో గ్రామాల్లో ప్రేమబంధాలు వెల్లివిరుస్తున్నాయి. గ్రామాల్లో సరైన ఉపాధి పనుల్లేక పొట్టకూటి కోసం ఊరు విడిచి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కార్మికులు సంక్రాంతి పండగకు గ్రామాలకు చేరుకుంటున్నారు. వలసలు పోవడంతో నిన్నటి వరకూ జనసంచారమేలేని ఇళ్లకు తాళాలు వేసి బోసి పోయిన గ్రామాలు నేడు జనంతో సందడిగా కనిపిస్తున్నాయి. వలసలతో ఆత్మీయ బంధాలతో పాటు బాల్యం కనుమరుగైపోగా అక్కున చేర్చుకునే అలనా, పాలనా కరువై అష్టకష్టాలుపడుతున్న చిన్నారులకు మరో పది రోజుల పాటు తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పొందనున్నారు. సంక్రాంతి పెద్ద పండగ కావడంతో ఉపాధి, ఉద్యోగాలు, వివిధ పనుల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు తిరిగివస్తున్నారు. ఆరు నెలలుగా సంపాదించిన సొమ్ముతో ఇళ్లకు సున్నాలు వేసి, కొత్త దుస్తులు కొనుక్కొని సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోనున్నారు. మండలం కేంద్రంలో బస్సుల నుంచి దిగే కూలీలే గత వారం రోజులుగా కనిపిస్తున్నారు.

మన్యంలో సంక్రాంతి శోభ

మండల కేంద్రంలో జరిగే వారపు సంతకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. వారపు సంతలో కొత్తబట్టలు కొనుగోలుదారులతో బట్టలు దుకాణాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతకు భోగి పండుగ ఒక రోజు ముందు కనుక మండలంలోని అనేక గ్రామాలకు చెందిన గిరిజన రైతులు అమ్మకాలు జరిపారు. మన్యం ప్రాంతంలో గిరిజనులు అన్ని అవసరాలకు వారపు సంతపైనే ఆధారపడతారు. మైదాన ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేయాలంటే ఆర్థిక భారం గనుక అందుబాటులో ఉన్న వారపు సంతలను ఆశ్రయిస్తారు. సంక్రాంతి పండగ అంటేనే ఆచార సాంప్రదాయాలతో కూడిన పండగ. గిరిజన రైతులు పండించిన, సేకరించిన వాణిజ్య పంటలైన చిక్కుళ్లు, ఎర్ర కందులు, తెల్లకందులు, పసుపు, పిప్పళ్లు, గుమ్మడి కాయలు, కొండ చీపుర్లు, కరక్కాయలు వంటి అటవీ ఉత్పత్తులను సేకరించి ఆదాయాన్ని సమకూర్చుకొని పండగ అవసరాలు తీర్చుకుంటున్నారు. పండుగకు ఇంటికి ఎవరొచ్చినా మద్యం ఇస్తారు. అదే గిరిజనుల ఆచారం. సంక్రాంతి పండుగ శోభతో వారపు సంతల్లోనూ, గ్రామాలు కళకళలాడుతు న్నాయి.

కిక్కిరిసిన భామిని సంత

భామిని : వారంలో ప్రతీ గురువారం నిర్వహించే భామిని సంత, పండగకి ముందు ఈ గురువారం కిక్కిరిసింది. సంక్రాంతి పండుగకు అవసరమైన సామాన్లు కొనుగోలుకు గిరిజన గ్రామాలు, మైదాన ప్రాంతాలు నుండి వచ్చిన జనాలతో సంత కొలహాలంగా మారింది. ఈ సందర్భంగా దేవుడు, ఇంటి పెద్దలు కోసం కొత్త కుండలు, ఎర్రకాండమలం, చెరుకు, బెల్లం, పెండ్లమ్, అలంకరణ సామాన్లు, పండుగకు వచ్చే చుట్టాలు కోసం కోళ్లను సంతకి వచ్చిన వారు కొనుగోలు చేసారు. ప్రస్తుతం బయట అన్నీ రకాల వస్తువులు దొరుకుతున్న, సంక్రాంతి వేళ సంతలో కొంటె కొంత ఆనందగా, సరదాగా ఉంటుందని గతంలో కుటుంబం సభ్యులతో కలిసి సంక్రాంతికి కావలసిన సామాన్లు సంతలో కొనుగోలు చేసేవాళ్ళమని, ప్రస్తుతం ఆ విధానం లేదని, బయటికంటే సంతలోనే వస్తువులు రేట్లు అధికంగా ఉన్నాయని కొనుగోలు చేసిన పలువురు తెలిపారు.



భామిని సంతలో సరుకులు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు



మిల్లు వద్ద ధాన్యం బస్తాలతో నిరసన తెలుపుతున్న రైతులు, రైతుసంఘం నాయకులు

ఆగ్రహించిన అన్నదాత

- రైస్ మిల్లు గేటు వద్ద ధాన్యం బస్తాలతో బైఠాయింపు
- మిల్లర్ల దోపిడీని అరికట్టాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్మేందుకు అటు పాలకులు, ఇటు అధికారులు అన్నదాతను నానా తిప్పలు పెడుతున్నారు. రెండు రోజులైనా ధాన్యం అన్‌లోడ్ చేయకపోవడంతో రైతులు ఆగ్రహించారు. మిల్లు గేటు వద్దే ధాన్యం బస్తాలు వాహనాల నుంచి దించి రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యాన బైఠాయించి నిరసన తెలిపారు. మండలంలో ఖడ్గవలస వెంకటలక్ష్మి మోడ్రన్ రైస్ మిల్ గురువారం సాయంత్రం వరకూ ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక రెవెన్యూ అధికారులు సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు హుటా హుటిన ఆందోళన వద్దకు చేరుకొని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కరణం రవీంద్ర, బివి రమణ, మరడాన సింహాచలం నాయిడు తదితర నాయకులతో చర్చలు జరిపి ఇప్పటికే గత రెండు రోజులుగా ఉన్న వాహనాలను అన్లోడింగ్ చేయించడంతో రైతులు ఆందోళన విరమించారు.

తొలుత నాయకులు రవీంద్ర, బివి రమణ ఖడ్గవలస సమీపాన గల వెంకటలక్ష్మి మోడరన్ రైస్ మిల్లు వద్ద గత రెండు రోజులుగా ధాన్యం అన్లోడింగ్ జరగక వేచి ఉన్న లారీ, ట్రాక్టర్ల కార్మికులు, రైతులతో వారు మాట్లాడారు. మిల్లర్ల దోపిడీని నిరోధించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. చట్ట విరుద్ధంగా నాలుగు కేజీల ధాన్యాన్ని అదనంగా రైతుల నుంచి రైస్ మిల్ యజమానులు తీసుకుంటున్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందని తెలిపారు. రైస్ మిల్ యజమానులు రైతులను బ్లాక్ మెయిల్ చేసేలా మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో దించకుండా వేధిస్తున్నారని, అదనంగా డబ్బులు, ధాన్యం ఇచ్చిన వారి ధాన్యాన్నే మాత్రమే సకాలంలో దించుతున్నారని విమర్శించారు. ఈ విషయమై ఇప్పటికే రెవెన్యూ ,సివిల్ సప్లై అధికారులకు తెలిపామన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని అమలు చేసి తక్షణమే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను వేధింపులకు గురి చేస్తున్న రైస్ మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రాజన్నదొరకు కేక్ తినిపిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రాంతిలాల్ దండే; అధికారులు

డిప్యూటీ సిఎంకు శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి.రాజన్నదొరకు వరుస శుభాకాంక్షల పరంపర కొనసాగుతోంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పని అధికారులు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పడానికి ముందుకొస్తున్నారు. ఈనెల 9న 'ప్రజాశక్తి'లో గిరిజన మంత్రి అంటే అంత అలుసా అన్న శీర్షికతో ప్రచురించిన కథనం మన్యం జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రకంపనలు సృష్టించింది. గురువారం అమరావతిలో ఉన్న రాజన్నదొరను ఆయన నివాసంలో ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు కలిశారు. ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అధికారులు రాజన్నదొరకు తినిపించారు. ఈ ఏడాది జనవరి 1న శుభాకాంక్షలు చెప్పడానికి హాజరు కాని మన్యం జిల్లా అధికారులు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పేందుకు ముందుకొస్తున్నారు. మంగళవారం పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ మంత్రి నివాసంలో కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఏటా జనవరి1 న మంత్రులు, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు చెప్పడానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తరలి వస్తుంటారు. అలాగే ఈ ఏడాది కొత్త సంవత్సరం రోజున గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర నివాసానికి పెద్ద సంఖ్యలో జిల్లా, ఉన్నతాధికారులు తరలి వస్తారని అధికారపార్టీ నాయకులు కార్యకర్తలు భావించారు. మన్యం జిల్లా అధికారులే శుభాకాంక్షలు చెప్పడానికి మొహం చాటెయ్యడం పార్టీ నాయకులు, కార్యకర్తలలో చర్చనీయాంశమైంది.

సమగ్రశిక్షలో నోటిఫికేషన్ అవాస్తవం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా సమగ్రశిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వస్తున్న వార్తలలో ఎలాంటి నిజం లేదని జిల్లా సమగ్రశిక్షా అదనపు పథక సమన్వయకర్త వేమలి స్వామి నాయుడు తెలిపారు. జిల్లా సమగ్రశిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబ్ ఆర్డినేటర్స్ మొదలగు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయినట్లు జిల్లాలో ఒక అబద్దపు ప్రచారం జరుగుతున్నట్లు తమ దష్టికి వచ్చిందని తెలిపారు. జిల్లా కార్యాలయంలో పోస్టులు భర్తీ చేయాలని తమకు స్టేట్ అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ఎపిసి చెప్పారు. కానీ ఒక ఫేక్ వెబ్ సైట్ ద్వారా ఈ విషయం తన నోటిసుకు వచ్చిందని తెలిపారు. ఈ వెబ్ సైట్ కు గాని, upi app రన్ చేస్తున్న వారికి గాని జిల్లా సమగ్రశిక్షు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. నిరుద్యోగులంతా ఈ విషయాన్ని గమనించి మోసపోవద్దని సూచించారు.

పవన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - భోగాపురం



అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్

మండలంలోని అమటాం రావివలస పంచాయతీలోని ప్రైవేట్ రిసార్ట్స్ వద్ద పవన్‌కు జనసేన నాయకులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ రిసార్ట్స్ నుంచి పవన్ కళ్యాణ్ శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో జరిగిన యువశక్తి సభకు 2.30 నిమిషాలకు బయలుదేరి వెళ్లారు. దీనికి ముందుగా యువత పెద్ద ఎత్తున రిసార్ట్స్ వద్దకు చేరుకున్నారు. వారికి అభివాదం చేస్తూ పవన్ ముందుకు సాగారు. కొంతమంది యువకులు పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక చిత్రపటాలతో పాటు పుస్తకాలు అందజేశారు.

స్టాంప్ పేపర్ విక్రయాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర వ్యాప్తంగా స్టాంప్ పేపర్ అమ్మకం దారులపై విజిలెన్స్ శాఖ జరిపిన తనిఖీలలో గురువారం నగరంలోని పలు లైసెన్స్ స్టాంప్ వెండర్లను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో కొందరు స్టాంప్ వెండర్లు నిర్దేశిత ముఖ విలువ కన్నా అధిక ధరలకు స్టాంప్ పేపర్లను అమ్ముతున్నట్లు విజిలెన్స్ అధికరులు గుర్తించి సంబంధిత అమ్మకాందారులపై చర్యలకు సిఫార్సు చేశారు. దాడులలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, హెడ్ కానిస్టేబుల్ అప్పన్న, పురుషోత్తం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి ఆనంద్, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

వ్యాధుల నివారణే లక్ష్యంగా పని చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రక్త పోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా అత్యవసర కేసులను ఆసుపత్రిలో చికిత్స, మెరుగైన వైద్యానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణులకు ప్రభుత్వాసుపత్రికి శత శాతం తరలించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. పాఠశాలల్లో నాడు- నేడు పనుల తనిఖీలో భాగంగా జగనన్న గోరుముద్ద పథకం నాణ్యతతో పాటు విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం, విద్యా బోధన పరిశీలించాలన్నారు. ఏడాది లోపు వయస్సు గల శిశువుల నమోదును స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు చేపట్టాలన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో టీనేజ్ గర్భిణీలు, రక్త హీనత లోపం ఉన్నవారిని వారం రోజుల ముందు ప్రసవ సమయం ఉన్న వారిని ఎఎన్ఎం, గ్రామ సచివాలయ మహిళా పోలీస్‌ల ద్వారా గుర్తించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రక్తహీనత ఉన్న మహిళలకు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించి హిమోగ్లోబిన్ శాతం పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఐరన్ ఫోలిక్ మాత్రలు అందిస్తున్నామని తెలిపారు. ఎన్‌సిడి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. అమృత్ సరోవర్ కార్యక్రమం కింద చెరువు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం..యువతకు ఆదర్శం



పాలకొండ : వివేకనందునికి నివాళ్లు అర్పిస్తున్న కాలేజీ సిబ్బంది

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తన ప్రసంగాలతోనే కాకుండా నిబద్ధతతో కూడిన జీవితాన్ని గడిపిన స్వామి వివేకానందుని బోధనలతో పాటు ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి నిర్వహించిన వివేకానందుని జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ నిర్మాణానికి, అభివృద్ధికి యువత అనుసరించాల్సిన మార్గం గురించి ఆయన మార్గ నిర్దేశం చేసే వారిని అన్నారు. త్యాగాలతో కూడిన సామాజిక సేవ మనుషుల వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహన రావు, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, టి.వెంకటరావు, నాయకులు జి.వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, జాగాన రవికుమార్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో బియ్యాల వలస పంచాయతీ దురిబిల్లిలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యూత్ ఎంపవరుమెంట్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు షేక్ గౌస్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ పి.ఆజారి హాజరై యువతను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ యువత సక్రమ మార్గంలో పయనించి మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు, షేక్‌గౌస్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తమలో చైతన్యం, పరిజ్ఞానం పెంపొందించి గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీలోని యువత, సచివాలయం సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో...

స్థానిక టిడిపి కార్యాలయం వద్ద స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి దివాకర్ ఆధ్వర్యంలో తెలుగు యువత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన యువతకు చేసినటువంటి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి యువత బెలగపు అజిత్, రాజేష్, దాసరి వెంకటేష్, సుధీర్, తులసి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : భారతదేశ ఖ్యాతిని, సాంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానందని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుందామని డిజిటల్ గ్రీన్ ఫౌండేషన్ రీజనల్ కోఆర్డినేటర్ సురేంద్ర అన్నారు. స్వామి వివేకనంద జన్మదిన సందర్భంగా గరుగుబిల్లి మండలం తోటపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణమిషన్, రామకృష్ణ మఠాలను స్థాపించి ఎంతోమంది విద్యావంతులను సమాజ సేవకు అంకితం చేశారని కొనియాడారు. యువతకు స్ఫూర్తిగా, మార్గ నిర్దేశకుడిగా చరిత్రలో నిలిచిపోయే గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు డి. పారినాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, సింహాచలం నాయుడు, కో-డైరెక్టర్ ఎం.నూకం నాయుడు ఉన్నారు.



సీతంపేట : వివేకనందునికి నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థినులు

పాలకొండ రూరల్: స్వామి వివేకానంద జయంత్యుత్సవ కార్యక్రమం స్థానిక వివేకానంద హైస్కూల్‌లో ఘనంగా జరిగింది. స్వామి విగ్రహాన్ని నిలువెత్తు పూలమాలతో అలంకరించారు. ప్రిన్సిపల్ గవర పారినాయుడు మాట్లాడుతూ వివేకానందుని జీవితం ఆదర్శప్రాయమని, అనుసరణీయమ న్నారు. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లెక్చరర్ పైల శంకరరావు వివేకానందుని ఘనతను కొనియాడారు. స్థానిక పెదకాపువీధి హైస్కూల్ బయాలజీ అసిస్టెంట్ అప్పికొండ రాంబాబు వివేకానందుని జీవితంలోని కొన్ని ఆసక్తికరమైన సంఘటనలు వివరించారు. కార్యక్రమంలో పున్నాన దుర్గా ప్రసాద్, గొర్లె రమణమూర్తి, ఉపాధ్యాయులు బి. అప్పారావు, ఎం. రామకష్ణ, పి. రామకష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కొమరాడ : స్వామి వివేకానంద ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్‌బాబు అన్నారు. మండలంలోని కంపవలస పంచాయతీ రాజ్యలక్ష్మీపురంలో వివేకానంద జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. యువతీ, యువకులంతా స్వామి వివేకనంద మార్గంలో నడిచేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, స్థానిక నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతంపేట : స్వామి వివేకానంద జయంతి వేడుకలు పులిపుట్టి సమీపాన గల భారతీయ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు కరస్పాండెంట్ ఎస్పీ పెంటయ్య వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ఆయన గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. అలాగే పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్, ఉపాధ్యాయులు మురళీమోహన్, మురళి, అప్పలనాయుడు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు .

వీరఘట్టం : మండలంలోని చిట్టపూడివలసలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎస్ రాంబాబు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని



కురుపాం : సభలో మాట్లాడుతున్న సర్పంచి అజారి



గుమ్మలక్ష్మీపురం : వివేకనందుని విగ్రహానికి పూలమాల వేస్తున్న పారినాయుడు

స్వామి వివేకానంద 160వ జయంతి ఉత్సవాన్ని అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ జూనియర్ కాలేజీలో గురువారం జరిపారు. డాక్టర్ బి. నిరోషా, విజ్ఞాన విహార పాలకమండలి సాధారణ సభ్యులు, యం.నరేష్ పాల్గొని పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో శ్రీ స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలను గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రీడర్స్, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

భామిని : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని, స్వామి వివేకానంద విగ్రహాన్ని గురువారం సోంబాబు మాస్టర్, ఎంఇఒ శ్రీనివాసరావు పాఠశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ, ఇలాంటి మహనీయుడు విగ్రహం పాఠశాలలో ఉంటే, భవిష్యత్తు విద్యార్థి లోకానికి వివేకానంద యొక్క గొప్పతనం, సమాజం, దేశం పట్ల ఒక విద్యార్థిగా చేయవలసిన పనులు నిరంతరం గుర్తుకు తెస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. వెంకటరావు, బత్తిలి హెచ్ ఎం వెంకటరమణ, బాలేరు జిల్లా పరిషత్ హెచ్ ఎం రమేష్, ఎంపిటిసి విష్ణు, ఉపాధ్యాయులు రమేష్, కలిశెట్టి విజయ్, శ్రీనివాస్ పండా, అనితరెడ్డి, ఎస్తేర్ రాణి, పెద్దిన సన్యాసిరావు, భవాని పాల్గొన్నారు.

బియ్యం కోసం 25 కిలోమీటర్లు ప్రయాణమా?



మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

కొమరాడ : ప్రభుత్వం ఇచ్చే ఐదు కేజీల బియ్యం కోసం 25 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి గిరిజనులకు ఉందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బియ్యం తీసుకెళ్తున్న గిరిజనులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 కేజీల బియ్యం కోసం 25 కిలోమీటర్ల దూరం గిరిజనలు వెళ్తే బియ్యం ఖర్చు కన్నా ఛార్జీల ఖర్చే ఎక్కువయ్యే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సందర్భంలో తినుకు గ్రామానికి గాను అందుబాటులో ఉండేలా నయా గ్రామంలో గానీ, వాటక కోసు గ్రామంలో గానీ జిసిసి ద్వారా బియ్యం సరఫరా చేసి తినకు గ్రామస్తులను ఆదుకోవాలని కోరారు. విషయం పైన త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకరి, చినబాబు. గంగమ్మ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో బదిలీలు తగదు

గుమ్మలక్ష్మీపురం : ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో గత కొన్నేళ్ల నుంచి గిరిజన ప్రాంతంలో సేవలు అందిస్తున్న గిరిజన ఆరోగ్య కార్యకర్తలను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయడం తగదని కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు ఎన్.కృష్ణబాబు అన్నారు. జిఒ 388 ప్రకారం 2015లో టిడిపి ప్రభుత్వం హయాంలో గిరిజన ప్రాంతంలో ప్రజలకు సేవలందించాలనే ఉద్దేశంతో గిరిజన ఆరోగ్య కార్యకర్తలను నియమించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు గిరిజనులకు మెరుగైన సేవలందిస్తున్నారని, అటువంటి వారిని బదిలీ చేయడం విచారకరమన్నారు. దీనివల్ల గిరిజన ప్రాంతంలో ప్రజలకు మెరుగైన సేవలందడం లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన ప్రజలకు అనారోగ్యం వాటిల్లిన, మెరుగైన సేవల ందకపోయినా ఆరోగ్యశాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

వీరఘట్టం : మండలంలోని నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో భాగంగా మరింత వేతనదారుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధి ఎపిడి జి.శ్రీహరిరావు ఫీల్డ్ అసిస్టెంట్లును ఆదేశించారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు లేని వారికి తక్షణమే జాబ్ కార్డులు మంజూరు చేసి పని కావలిసిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. మండలంలో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలపై సంరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్ రావు, ఎపిఒ సత్యంనాయుడు, ఇంజనీరింగ్ కన్సల్ట్, టెక్నికల్ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కంబరలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్

వీరఘట్టం : మండలంలోని కంబర గ్రామంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నవోనమ్మ, ఏఎన్ఎం హేమలత, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిది నియంత పాలన

వంగర : వైసిపిది నియంత పాలనని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండలంలోని అరసాడ గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని వైసిపి ప్రభుత్వం వైఫల్యాలపై ప్రజలకు కోండ్రు వివరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాభివృద్ధికి కేంద్రం కేటాయించిన నిధులను దారి మళ్లించడంతో గ్రామాలాభివృద్ధి నోచుకోక కుంటిపడ్డాయన్నారు. తన అనాలోచిత నిర్ణయాలతో సీఎం జగన్ మోహన్ రెడ్డి నియంత పాలనను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1.5 కోట్ల మంది ఉద్యోగాలు లేక నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, లచ్చుబుక్త ధనలక్ష్మి, లచ్చుబుక్త కృష్ణమూర్తి, బెజ్జిపురం రవి, బెజ్జిపురం ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

యువగళం పోస్టర్ ఆవిష్కరణ

పూసపాటిరేగ : స్వామి వివేకానాంద జయంతి, జాతీయ యువజనోత్సవం సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పతివాడ నారాయణ స్వామినాయుడు యువగళం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్వగ్రామం చల్లవానితోటలో టిడిపి అధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద జయంతి రోజున యువజన దినోత్సవంగా జరుపుకోవడం మనకు గర్వకారణమన్నారు. యువగళం పేరుతో జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రను విజయవంతమవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ , నాయకులు పతివాడ తమ్మునాయుడు, పల్లె బాస్కరావు, కర్రోతు సత్యనారాయణ, గేదెల రాజారావు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పతివాడ తారక్, నెల్లిమర్ల నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పిన్నింటి కిషోర్, కర్రోతు రాజు, చందక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

పూసపాటిరేగ : సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై పంచాయతీలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు కాలువ పూడికలు తీతతోపాటు, బ్లీచింగ్ చల్లిస్తున్నారు. పండగలో తాగునీరు పుష్కలంగా ఉండేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. వీధుల్లో లైట్లన్నీ వెలిగేలా చర్యలు తీసుకున్నారు. గురువారం మండలంలోని గుంపాంలో సర్పంచ్ యడ్ల ఆదిలక్ష్మితో పాటు కార్యదర్శి తిర్లంగ గాయత్రి పారిశుధ్య పనులు చేయించారు. గ్రీన్ అంబాసిడర్‌లతో గ్రామంలో ఉన్న చెత్త చెదారం శుభ్రం చేయించారు. కార్యదర్శి గాయత్రి మాట్లాడుతూ పండగ సందర్భంగా ఎటువంటి అంటువ్యాదులు ప్రభల కుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. సచివాల సిబ్బంది సహకారంతో పంచాయతీ పరిధిలో ఉన్న తొత్తడాం, కొవ్వాడ గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేయించామన్నారు.

కందిపప్పు నాణ్యతను పరిశీలించిన డిటి

విజయనగరం : రేషన్ దుకాణాల ద్వారా ఇస్తున్న కంది పప్పు నాణ్యతను విజయనగరం డిటి వర్రి వెంకటరామజగన్నాధరావు ఆధ్వర్యంలో గురువారం దాసన్నపేటలోని 52 రేషన్ డిపో వద్ద సిబ్బంది పరిశీలించారు. కంది పప్పులో నాణ్యత లోపించినట్లు విమర్శలు వచ్చన నేపథ్యంలో ఈ తనికీలు చేపట్టారు. డిపో వద్దే పొయ్యిపై పప్పును ఉడికించి నాణ్యతను పరిశీలించి బాగానే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ పరిశీలనలో సివిల్ సప్లయ్ టెక్నికల్ అసిస్టెంట్ హరికిరణ్, 8,9 సచివాలయాల విఆర్‌ఒలు సత్యవతి, నారాయణప్పడు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ఆరు వార్డులకు ఉజ్వల యోజన ఉచిత ఇండియన్ గ్యాస్ కనెక్షన్లను పంపిణీ జరిగింది. గురువారం జరజాపు పేటలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులు మీదుగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతి ఛైర్మన్ బంగారు సరోజినీ, కో-ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, తహశీల్దార్ కె.వి రమణ రాజు, నాగ వంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు పోలుబోతు నారాయణ, నల్లి శ్రీను, తుమ్మ భారతి కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22న ఆనందో బ్రహ్మ

బొబ్బిలి : ఈ నెల 22న యంగ్ మేన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో సర్వకళల ఆనందోబ్రహ్మ ప్రదర్శనను కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షులు ఎం.విజయమోహనరావు తెలిపారు. గురువారం బృందావనం ఫంక్షన్ హాల్లో నూతన కళాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ప్రతినెలా ఆనందోబ్రహ్మ ప్రదర్శనలో నూతన ఔత్సాహిక కళాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. చారిత్రక, పౌరాణిక, జానపద, శాస్త్రీయ, జానపద విభాగంలో పలువురు కళాకారుల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హ్యాపీ క్లబ్ సభ్యులు ఎన్నా బాబు తాడుతూరి, ఆర్.బెనర్జీనాయుడు, బి.జి.గంగాధర్, పి.నాగరాజు, పి.వెంకటరావు పాల్గొన్నారు.

చెత్తబుట్టలు పంపిణీ

మెంటాడ : మండలంలో గుర్ల గ్రామంలో ఆప్రో సంస్థ, ఎల్ఐసిహెచ్ఎఫ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు గ్రామస్తులకు డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. పొడి, తడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ఈ చెత్తబుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సత్యవతి, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఆప్రో ప్రతినిధి చుక్క శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

టైలర్లకు క్రాంతి లేని సంక్రాంతి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

దర్జీల బతుకే దర్జా అనుకొని ఆ వృత్తిని ఎంచుకున్న టైలర్లకు క్రాంతి లేని సంక్రాంతి అయ్యింది. గతంలో సంక్రాంతి వచ్చిందంటే టైలర్లకు ఖాళీ లేకుండా పనులు ఉండేవి. నేడు ఎక్కడా అది కనిపించడం లేదు. రాత్రనకా, పగలనకా సంక్రాంతి ముందు నెల రోజుల నుంచి బట్టలను కుట్టే టైలర్లకు నేడా పరిస్థితి కనిపించడం లేదు. కంటిమీద కునుకు లేకుండా నెల రోజుల పాటు పనిచేస్తే ఏడాదంతా దర్జాగా ఉంటామన్న భరోసానిచ్చే వృత్తి నేడు దయనీయ స్థితిలోకి వెళ్లిపోయింది. వృత్తి దర్జా అనుకున్న వారికి పనులు లేక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి.కార్పొరేట్ శక్తులు బట్టల వ్యాపారంలోకి అడుగెడడంతో టైలర్లు రోడ్డును పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. రెడీమేడ్ దుస్తులు వ్యాపారం మొదలైన నాటి నుంచి టైలర్లకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు నేడు ఆన్లైన్ వ్యాపారంలో కార్పొరేట్ వ్యక్తులు ప్రవేశించి ఆఫర్, డిస్కౌంట్ అంటూ ప్రకటనలు చేస్తూ వినియోగదారులను ఆకర్షించుకుంటూ తమ వ్యాపారాన్ని ఆన్లైన్లో కొనసాగిస్తూ మీ ఇంటి వద్దకే అందిస్తామంటూ వ్యాపారాలను కొనసాగించడంతో వినియోగదారులు కూడా అటువైపు మొగ్గుచూపుతో టైలర్లకు పనులు లేకుండా పోతున్నాయి. రెడీమేడ్ దుస్తులు ఆన్లైన్లో లభించడం, షాపుల్లో లభించడం టెక్నాలజీ పెరగడంతో ప్రతి ఒక్కరి చేతిలో చరవాణిలు ఉండడంతో ఆన్లైన్ యాప్‌లు చరవాణిలో ప్రత్యక్షమై వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. మన దేశ సంపదను దోచుకోవడమే కాక మన దేశ పౌరులు దర్జాగా బతికే వృత్తుల మీద కూడా దెబ్బతీస్తున్నారు. దీంతో దర్జాగా బతుకుతామన్న టైలర్లకు కుట్టుకునే పనులు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. వేలాదిమందికి బతుకు భరోసానిచ్చే దర్జీ వృత్తి నేడు రెడీమేడ్ వ్యాపారం, కార్పొరేట్ శక్తుల వ్యాపారుల వల్ల బతుకు భారమై వృత్తికి దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. సాంప్రదాయంగా తెలుగు నాట జరిగే సంక్రాంతి పండుగకు తమ కుటుంబాలు, పిల్లాపాపలతో ఆనందంగా గడపాల్సిన దర్జీవృత్తి నేడు క్రాంతి లేక దర్జీల ముఖాలలో దిగాలు కనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా అలవాటు పడిన వృత్తిని విడిచి వేరే పని అలవాటు లేని దర్జీలు ఎటు వెళ్లలేక ఏమీ చేయలేక కుట్టు పనులు లేకపోయినా తమ వృత్తిని వదులుకోలేకపోతున్నారు. ఏది ఏమైనా రెడీమేడ్, ఆన్లైన్ యాప్‌లు కార్పొరేట్ శక్తుల వల్ల టైలర్లు మూలన పడే పరిస్థితులు ఏర్పడ్డాయి.

రెడీమేడ్ వ్యాపారంతో పనుల్లేకుండా పోయాయి



రెడీమేడ్ దుస్తుల వ్యాపారం వచ్చిన తర్వాత మాకు చేతినిండా పని లేకుండా పోయింది. 40 ఏళ్ల నుంచి ఇదే వృత్తిని నమ్ముకుంటూ జీవిస్తున్నాను. టైలరింగ్ నేర్చుకోవడానికి పదేళ్ళు పట్టింది. దర్జీ అనుకోవడమే తప్పు వయసు మళ్లిన కొద్ది కళ్ళు, కాళ్లు చేతులు సహకరించవని, బతుకుతెరువు కోసం వృత్తిని మానుకోలేకపోతున్నాం. సంక్రాంతి వస్తే గతంలో ఖాళీ లేకుండా బట్టలు కుట్టేవాళ్లం. రాత్రంతనకా, పగలనకా కుట్టే మా టైలర్లకు రెడీమేడ్ పుణ్యమా అని రిపేర్లు కొట్టుకోవడం, రెడీమేడ్ దుస్తులు సైజులు మార్పులు చేసుకునే దుస్థితి టైలర్లకు ఏర్పడింది.

బార్లంకి తిరుపతిరావు, టైలర్, పెదమేరంగి



బట్టలు కుడుతున్న టైలర్లు

పనుల్లేక... వృత్తిని వదులుకోలేక..



సంక్రాంతి వస్తే రాత్రనకా, పగలనకా నిద్రాహారాలు మాని టైలరింగ్ పనులు చేసేవాళ్లం. ప్రస్తుతం పనులు లేక వృత్తిన వదులుకోలేక మా వృత్తిని కొనసాగించుకుం టున్నాం. ఆన్లైన్ వ్యాపారం వచ్చి రెడీమేడ్ దుస్తులను ఇంటి వద్దకు వినియోగదారులు తెప్పించుకుంటున్నారు. ఆన్లైన్ వ్యాపారం వల్ల మా వృత్తి పూర్తిగా దిగజారి పోయింది. ఏళ్ల తరబడి చేస్తున్న వృత్తిని మానలేక ఇదే వృత్తిలో కొనసాగడంతో వేరే పనులు మాకు చేతకాక ఎటూ వెళ్లలేని దీనస్థితిలో ఉన్నాం.

బొంతలకోటి నారాయణరావు, దాసరిపేట

విద్యాసంస్థల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- పార్వతీపురం

పట్టణంలో ఆర్కే జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిపించారు. ఆ కళాశాల డైరెక్టర్ పూడి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు భోగి మంటలను వేశారు. విద్యార్థులతో సంక్రాంతి రంగుల హరివిల్లుల ముగ్గులు వేయించారు. అనంతరం సంక్రాంతి, ఆటలు, లెమన్ స్పూన్, బెలూన్ గేమ్, మ్యూజికల్ చైర్, వాలీబాల్, సాంప్రదాయ దుస్తులు ధరింపు పోటీలు నిర్వహించి కళాశాల డైరెక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపల్ బి.భూపాల్, వైస్ ప్రిన్సిపల్ ఎం.గంగుబాబు, ఎఒ వాసు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండగ ప్రతిష్టాత్మకమైందన్నారు. పేద, ధనిక, చిన్నా, పెద్ద తేడా లేకుండా అంగరంగ వైభవంగా సంక్రాంతి పండుగలు జరుపుకుంటారని ముందుగానే మన కళాశాలలో సంక్రాంతి పండగను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని పెదమేరంగి జంక్షన్లో గల తిరుమల సాయి విద్యానికేతన్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నింటాయి. పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి, పాఠశాల సలహాదారులు రౌతు వెంకటరమణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టేలా విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. గంగిరెద్దులతో పాఠశాలలో సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ఆనంద చకితులను చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు ఎంతో ఆనంద ఉత్సవాలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించుకున్నారు.



పార్వతీపురం: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డైరెక్టర్ రామకృష్ణ



జియ్యమ్మవలస: సంక్రాంతి సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థులు

గ్రామాల్లో గంగిరెద్దుల సందడి

భామిని : సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో గంగిరెద్దుల సందడి చేస్తున్నాయి. వలసలు వెళ్లిన వారు, చదువులు నిమ్మితం బయటికి వెళ్ళొచ్చిన వారు, గంగి రెద్దులు డు-డు బసవన్నలు, హరిదాసులు పాటలతో గ్రామాలలో సంక్రాంతి పండగ శోభ సంతరించు కుంటుంది. సాధారణంగా గ్రామాలలో గంగిరెద్దులు రాకతో సంక్రాంతి పండగ వచ్చినట్లు కనిపిస్తోంది. హరిదాసు పాటలు, గంగిరెద్దుల డప్పు, సన్నాయి మేళాలు పిల్లలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. నరసన్నపేట పరిసర ప్రాంతాలు నుండి పల్లెలకు వచ్చిన గంగిరెద్దుల వారిని ప్రజాశక్తి పలకరించగ.. తమ కుల ఆచారం, వృత్తి ధర్మం ప్రకారం పండగ వేళ తమ పిల్లలను ఇంటివద్ద వదిలి భార్యలతో గ్రామాలలో గంగి రెద్దులను ఆడిస్తూ, ప్రజలు ఇచ్చిన కానుకలను స్వీకరిస్తూ, సంక్రాంతి నుండి శివరాత్రి వరకి గ్రామాలలో తిరుగుతామని గంగిరెద్దుల కుటుంబానికి చెందిన వై. ముకుంద, బి. తారకరావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏటా కుల ధర్మం తుచా తప్పకుండా నిర్వహించే తమకు ప్రభుత్వం కలకారుల పెన్షన్ గాని, పశు పోషణకు కనీసం సంవత్సరానికి ఏదైనా పథకం అందిస్తే బాగుంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం వైసిపి అన్నీ కులావృత్తులు వారికి వారి వృత్తులు ఆధారంగా సంక్షేమ పథకాలు ఇస్తుందని, కానీ జిల్లాలో కేవలం 500 కుటుంబాలు వుండే గంగి రెద్దుల కులం వారికి ఏ పథకం లేదని, కేవలం ఈ సీజన్ అనంతరం కూలి పనులు చేసుకుంటూ కాలం వెళ్ళబోస్తున్నామని, ప్రభుత్వం అలోచించి పశు పోషణ నిమ్మిత్తమైనా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



బామిని: గ్రామాల్లో సందడి చేస్తున్న డూడూ బసవన్నలు

వనరుల ఆవశ్యకతను వివరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రకృతి వనరులు ఆవశ్యకతను చిన్నప్పటి నుంచే చిన్నారులకు వివరించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అన్నారు. పునర్వ్ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ శరవణన్ రాజగోపాలన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జట్టు ఆశ్రమంలో వివేకానంద జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హిందూతత్వం అంటే మతం కాదని, సమూహ జీవన విధానమని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానందను అంతా స్ఫూర్తివంతంగా తీసుకోవాలని కమిషనర్ కోరారు. మరొక ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ముఖ్యంగా యువత యువశక్తిగా ఎదిగి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కాగలరని ఆకాంక్షించారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యం, అభివృద్ధి, విజ్ఞానానికి సంకేతాలన్నారు. "గాలి, నీరు, భూమి కాలుష్యానికి కారణాలు, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో నీపాత్ర" అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన, పెయిటింగ్ పోటీలు, సంప్రదాయ వంటలు, పర్యావరణ హితమైన అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ ప్రతిభను చాటారు.

విజేతలకు బహుమతులు అందజేత

అలాగే ఒకటో తరగతి విద్యార్థి రితిక్‌రెడ్డి వివేకానంద జీవితాదర్శంపై చేసిన ప్రసంగం, జట్టు కళాకారుల బృందం నృత్య ప్రదర్శనలు, యోగాసనాలు, కర్రసాము, కత్తిసాము తదితర సాహస కృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు నందివాడ కృష్ణబాబు పంపిణీ చేసి బహుమతులను విజేతలకు అందించడంతో పాటు అతిథులను జ్ఞాపకాలతో సత్కరించారు. కార్యక్రమంలో జట్టు నిర్వాహకులు పద్మజ , పంచాయతీ రాజ్ డిఇ లక్ష్మణరావు, విక్రమపురం ఎంపిటిసి సభ్యులు దేవకోట వెంకటనాయుడు, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ, ఉపాధ్యాయులు రేవళ్ల సతీష్‌రాజు, గొండేల రాజు, అల్లువాడ కైలాసరావ్, గొంగాడ రామారావు, చుక్కా పారినాయుడు, సిహెచ్.రామకష్ణ, వనజ, పి.శైలజ, ఎం.ఈశ్వరరావు, మీగడ శ్రీనివాసరావు, కమల, ఎం.విజయమోహన్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

దుప్పట్లు పంపిణీ

పార్వతీపురం రూరల్ : మండలంలోని చినమరికిలో గురువారం వివేకానంద స్వామి జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి మహిళలకు, వృద్ధులకు దుప్పట్లు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందని బోధనలను అవగాహన చేసుకుని యువత సామాజిక పరమైన సేవలందించి సమాజంపై ప్రేమను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంటా అప్పలస్వామి, గంటాలక్ష్మి, నామాల గంగ, అలజంగి రాణి, రావుపల్లి నిర్మల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ ప్రారంభం

సాలూరు : పట్టణంలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయం ఆవరణలో గురువారం పార్వతీపురం మన్యం జిల్లా డిఎఫ్ఒ జివిపి ప్రసూన నర్సరీను ప్రారంభించారు. ప్రజలకు అవసరమైన మొక్కలు పంపిణీ చేయడానికి నర్సరీని అందుబాటులో వుండేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి కె.రామారావు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

గుమ్మలక్ష్మీపురం : పంచాయతీ కార్యదర్శులు విధుల్లో అలసత్వం పనికిరాదని ఇన్చార్జి ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో అరసత్వం లేకుండా అధికారులు నిర్దేశించిన మేరకు విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పంచాయతీ పరిధిలో ఇళ్ల పన్నులు, పారిశుధ్య నిర్వహణ, సంక్షేమ పథకాల అమలులో సమయ పాలన తదితర అంశాలలో సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు.

సబ్సిడీపై కారు లోను

డెంకాడ : డెంకాడ గ్రామానికి చెందిన డోల రామారావుకు ఎస్‌బిఐ సౌజన్యంతో కారులోనును సబ్సిడీపై ఎంపిపి వెంకట వాసుదేవరావు చేతులు మీదుగా వైకెపి కార్యాలయంలో అందించారు. గంజి పద్మావతికి పిఎంఇజిపి కింద ఎపిజివిబి ద్వారా జిరాక్స్ మిషను సబ్సిడీపై అందించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రొంగళి కనక సింహచలం, సర్పంచ్ గౌరి, వైస్ సర్పంచ్ ఆదినారాయణ, వార్డు మెంబెర్ సురేష్ ఎపిఎం విజయలక్ష్మి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో గడపగడపకు

ప్రజాశక్తి - సీతానగరం

మండల ంలోని పెదభోగిలి-2 సచివాలయం పరిధిలో గల అప్పయ్యపేటలో అలజంగి జోగారావు ఆధ్వర్యాన చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారికి ప్రభుత్వం చేసిన మేలును వివరించి, వారి సమస్యలు పరిష్కరించి వారి వద్ద నుంచి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ఎంపిటిసి సభ్యులు బురిడీ కుసుమ, సూర్యనారాయణ, పంచాయతీ, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

యూనిఫాం పంపిణీ

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం పారిశుధ్య కార్మికులకు రెండు జతల యూని ఫారం పంపిణీ చేశారు. మరో 14 మందికి మూడు చీరలు, జాకెట్లు, మూడు తువ్వాళ్లు, 4కేజీల కొబ్బరినూనె, 24 సబ్బులు, చెప్పులు, బట్టలు, ఇంజనీరింగ్ సిబ్బందికి రెండు జతల బట్టలను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ యందవ రాధా కుమారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



యూనిఫారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- సీతంపేట

పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, సీతంపేట ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు గురువారం ఐటిడిఎ పిఒ బి.నవ్య సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 6 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 4 పోస్టులకు 19 దరఖాస్తులు వచ్చాయని ఆమె తెలిపారు. హాజరైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఒ కె.విజయ పార్వతి, సిడిపిఒ పి. రంగలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




ఇంటర్వ్యూ చేస్తున్న పిఒ నవ్య

శంబరలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని సంబర గ్రామ పంచాయతీలో ఎంపిడిఒ దేవకుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 23 నుండి మార్చి నెల ఆఖరి వరకు 10 వారాలు పాటు పోలమాంబ జాతర జరగనున్న నేపథ్యంలో ఎంపిడిఒ దగ్గరుండి పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. కొన్నిచోట్ల అధికశాతం పేరుకుపోయిన చెత్తను జెసిబితో తొలగిసున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం, ఉప సర్పంచ్ వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



మక్కువ: పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ



సీతానగరం: పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

సీతానగరం : మండలంలోని చినబోగిలి చల్లమనాయుడువలస, గుచ్చిమిలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సర్పంచులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. పూడికతీతలు మురికి నీళ్ల నిల్వలు తొలగింపు, తుప్పలు, డొంకలు తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు కె.రాధా శ్రీనివాసరావు, ఎం.శ్రీదేవి, వి.భాతరమ్మ, పంచాయతీ కార్యదర్శులు బి.మనోహర్, టి.వెంకటరమణ, పీటర్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

సాలూరు : పట్టణంలోని నాయుడు వీధి సమీపంలో వానపల్లి భవానీ(35) ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త శంకరరావు పట్టణంలో కాంట్రాక్టరుగా పని చేస్తున్నారు. భవానీ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పట్టణ పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు.

యువకుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా జి. శిగడాం మండలం ఆభోతుల పేటకు చెందిన ఎం.శ్రీనివాసరావు డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. గుంటూరు నుంచి విశాఖపట్నం మీదగా శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు గుంటూరులో ఎసి మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మృతదేహాన్ని సుందర పేట సిహెచ్‌సికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వంగర : మండలంలోని అరసాడ, కొండవలస జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రేగిడి మండలం కోడిశ గ్రామానికి చెందిన పెదగాడి హరిబాబు (37) అరసాడలో తన పని ముగించుకొని తిరుగు ప్రయాణంలో బైక్ పై కర్రలు పట్టుకొని వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొనడంతో హరిబాబుకు గాయాలయ్యాయి. ఢీకొన్న బైక్ ఆచూకీ కోసం గాలించిన ఫలితం లేకపోయింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వ్యక్తిని రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

కొమరాడ : ట్రాక్టర్ నుంచి జారిపడే వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. కొమరాడ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బట్టి వలస చేశాడు వలస గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పొలం పనుల నిమిత్తం వెళ్తున్న ఊరికి జీవన్ ట్రాక్టర్ పైనుంచి జారిపడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించడంతో జీవన్ ముత్యందినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.